# ప్రకృతి

"ఒరేయ్ వాసూ! మిల్క్ వేన్ వచ్చే వేళయింది. వెళ్ళి నాలుగు పేకెట్లు తీసుకురారా నీకు పుణ్యముంటుంది." నిద్రపోతున్న పెద్ద కొడుకును కుదిపి లేపే ప్రయత్నం చేస్తూ అంది లలితమ్మ.

"ఏంటమ్మా అప్పుడే నీ గోల ! రీహార్సల్స్ చేసొచ్చి నేను పడుకున్నది ఒంటిగంటకు. పాల పేకట్లు కూడా నేనే తీసుకురావాలా ఏమిటి ? కిష్టిగాడిని పంపరాదూ?" అని కోపంగా, చిరాగ్గా అనేసి ముసుగు బిగించాడు వాసు.

" ఒరేయ్ కిష్టూ! నువ్వన్నా లేవరా, లేవరా అంటుంటే?"

" ఇవాళ నాకు క్రికెట్ మేచ్ ఉందమ్మా. బాగా రెస్ట్ తీసుకొవాలని చెప్పలేదూ"?

"చెప్పావులే కానీ సాయంకాలానికి అక్కా బావా వాళ్ళు వస్తున్నారు కదరా? కాఫీలకీ, పెరుక్కీ ఎక్కువ పాలు కావాలి. మన వాడుక మనిషి పోయనన్నాడు. ఎలాగో లేచి వెళ్ళి నాలుగు పాకెట్లు తీసుకురారా? నా బంగారు తండ్రీ - వినవూ?"

"నన్ను కాకాపట్టి లాభం లేదమ్మా. ఆ బూత్ వాడు పిల్లలు వెళ్తే పేకెట్స్ ఇవ్వడు. వాడి మొహం చూస్తేనే నాకు క్రికెట్ బంతిని బాదినట్లు బాదాలనిపిస్తుంది. కాదంటే తగాదా తప్పదు. ఎందుగ్గాని అక్కయ్యను పంపు." మూడంకె వేసి కిష్టు ముడుచుకుని పడుకున్నాడు.

పక్క మంచం మీద పడుకొని ఉన్న శ్యాముని లేపటానికి లలితమ్మకు భయమేసింది. అసలే చూచిరమ్మంటే కాల్చివచ్చేరకం పిల్ల అది. పైగా ...

" మమ్మీ భయపడకు. అయ్ హేవ్ నో అబ్జెక్షన్ టు గో. బట్... నా సంగతి నీకు తెలుసుగా ? మేకప్ చేసుకోందే బయటికి కాలు పెట్టను."

అమ్మో! శ్యాము స్నానం, మేకప్... అంటే పది గంటలవుతుంది.

"వద్దులేమ్మా పడుకో. అసలే నువ్వు ఆడపిల్లవు."

" ఆ మాటంటేనే నాకు మండేది. ఏం? నాకు భయమనుకున్నావా? ఆ కాలం పోయింది." అంటూ శ్యాము ఉపన్యాస ధోరణిలో పడిపోయింది.

భారంగా ఒక్క నిట్టూర్పు విడిచి లలితమ్మ అక్కడి నుంచి మెల్లగా వెళ్ళిపోయింది. తనే వెళ్ళి పాల పాకెట్లు తెచ్చుకోవాలని నిర్ణయించుకొని వెళ్తూవెళ్తూ తమ గదిలోకి తొంగి చూసింది. భర్త విశ్వనాథం గురక పెద్దగా వినిపిస్తోంది.

అతనికి నిద్రాభంగం కలగకుండా తలుపు మెల్లగా దగ్గరికి వేసి, ఆమె వాకిట్లోకి కాలు పెట్టింది.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. కరెంట్ కోతవల్ల వీధి దీపాలు కూడా అప్పుడే

ఆరిపోయాయి. రాజవీధికుండే అనేక చిన్న వీధుల్లో ఇదొకటి కావటం వల్ల జనసంచారం లేదు.

అలవాటైన వీధి కావటం చేత నిర్భయంగా నాలుగడుగులు వేసింది లలితమ్మ. కానీ అంతలోనే ఆ మసక వెలుగులో రోడ్డుమీద కనిపించిన దృశ్యాన్ని చూసి ఒక్క క్షణం ఆగిపోయింది.

ఒక ఆవు రోడ్డు మీద బాధగా అటూ ఇటూ తిరుగుతోంది. కొంచెం సేపు పడుకుంటున్నది. మళ్లీ లేస్తున్నది. మెల్లగా అరుస్తోంది.

లలితమ్మ పల్లెటూల్లో పుట్టి పెరిగింది. ఆమె చిన్నతనంలో వాళ్ళ ఇంట్లో పాడి ఉండేది. గేదెలు, ఆవులు ఈనటాన్ని ఎన్నోసార్లు చూసింది. అందుచేత ఆమె ఆవు బాధను గ్రహించగలిగింది. ఒక్క అంగలో ఆమె ఆవు దగ్గరికెళ్ళింది.

సరిగ్గా అప్పుడే ఆవు జన్యుస్థానం నుంచి నీళ్ళబుగ్గ వచ్చి చితికిపోయింది. అంటే మరో అయిదు పదినిముషాల్లో ఆవు ఈనుతుందన్నమాట !

లలితమ్మకు కాళ్ళాడలేదు.

ఆ ఆవు ఎవరిది? ఎక్కడి నుంచి ఈ స్థితిలో ఇక్కడికొచ్చింది? ఎలా వచ్చింది? ఎన్నో ప్రశ్నలు.

ఇంతలో ఆమెకు కర్తవ్యం గుర్తుకొచ్చింది. ఒక్క పరుగున ఇంట్లోకి వెళ్ళింది.

"ఏమండీ త్వరగా లేవండి. నడివీధిలో ఆవు ఈనుతున్నదండీ. ఒరేయ్ వాసూ, కిష్టూ, శ్యామూ ... లేవండ్రా. త్వరగా లేవండిరా"

ఒక్క క్షణంలో నిద్రమత్తు వదిలి అంతా లేచి కూర్చున్నారు. ప్రశాంతంగా విషయం విని చర్చల్లో పడ్డారు.

"ఆ ఆవు ఎవరిదో, ఏమో! ప్రసవవేదన పడుతున్న ఆవు పట్ల జాలిచూపి సేవ చేయడం మంచి విషయమే. కానీ అంతా అయ్యాక యజమాని వచ్చి ఆవునీ, దూడనీ తోలుకుపోతాడు. మనకి మిగిలేది శ్రమ మాత్రమే. వెధవ లిటిగేషన్స్ మనకెందుకు కాని, గమ్మున నూరుకో".

విశ్వనాథం ఆఫీసులోనూ అంతే. స్వంత లాభం లేనిదే ఏపనీ చేయడు. లాభం లేని పనుల్ని క్వొరీలు వేసి నానబెట్టటంలో ఆయన కాయనే సాటి. అదంతా తన ఎఫిషియన్సీ అని గర్విస్తూంటాడతను. చేసేది గుమాస్తా ఉద్యోగమే అయినా నలుగురు పిల్లల్ని దర్జాగా పెంచి, మోడ్రన్‌గా హాయిగా జీవించగలగడంలో సీక్రెట్ అదే.

"కానీ డాడీ, ఈనిన ఆవు పాలతో జున్ను తయారుచేసుకోవచ్చునని ఎక్కడో చదివాను. నాకు జున్ను తినాలని ఉంది డాడీ".

"సౌందర్యపోషణకు ఆవు పాలు మంచిదని విన్నాన్నేను. నాకు కొంతకాలం ఆవు పాలు తాగుదామని ఉంది డాడీ" అలా పిల్లలు తమ కోరికల్ని చెప్పారు.

లలితమ్మకు వారి ధోరణి చిరాకేసింది. ఆ ఇంట్లో అన్ని విషయాల్లోనూ అంతే. ఎవరి కోరికలు అభిరుచులు వారివి.

వాసుకు నాటకాలు, సినిమాలంటే పిచ్చి. తనో పెద్ద సినిమా హీరో అయినట్లు పోజ్ కొడుతూంటాడు.

శ్యాము తనప్పుడే అమెరికా నుంచి దిగి వచ్చినట్లు ప్రవరిస్తుంది. అలంకరణలు, అభిరుచులు అన్ని పాశ్చాత్య ధోరణులే. పాశ్చాత్య సంగీతం, డాన్సులు, ఆమె అభిరుచులు.

ఇక కిష్టుగాడికి క్రికెట్ పిచ్చి. సునీల్ గవాస్కర్, కపిల్‌దేవ్ లాంటి టాప్ క్రికెటర్ల పేర్లు రోజుకు వందసార్లన్నా వాడి మాటల్లో స్మరణకొస్తూంటాయి. వారిలా జుట్లు పెంచుతాడు. డ్రెస్ చేసుకొంటాడు. వాళ్ళ మేనరిజమ్స్‌ను అనుసరించి అనుసరించి అది అలవాటుగా మారింది.

విశ్వనాథానికి పిల్లలంటే పిచ్చిప్రేమ. వాళ్ళ వేషాలను చూసి మురిసిపోతుంటాడు. అతను రెండు చేతులా డబ్బు సంపాదిస్తూండడం వల్ల వాళ్ళు ఆడింది ఆటగా, పాడింది పాటగా సాగుతోంది.

లలితమ్మకు వాళ్ళ ధోరణులేవీ నచ్చవు. అందుకే ఆమెకు " పిచ్చి అమ్మగా" ముద్దుగా ముద్ర వేసారంతా.

" అవతల ఆవు ఈనడానికి సిద్ధంగా ఉంటే కూడా మన లాభనష్టాల చర్చలేనా? ఛీ... నేను వెళ్తున్నాను, నాకు సాయంగా ఉంటుంది. త్వరగా రండి అంతా" అని శాసిస్తున్నట్లుగా అని వాకిట్లోకి పరుగెత్తింది.

ఆమె ఆవు దగ్గరికి సరిగ్గా సమయానికి వెళ్ళింది. ఆవు గర్భంలోనుంచి దూడ అప్పుడే బయటి కొస్తోంది. నయం ! ఇంకొక్క క్షణం ఆలస్యం అయితే దూడ క్రిందికి పడిపోయి ఉండేది. ఎంత ప్రమాదం? దూడని జాగ్రత్తగా చేతుల్తో పట్టుకొందామె. లేత గోళ్ళని గిల్లి ఆవుకు తినిపించింది.

"లలితా ? తెల్లవారుతోంది. నలుగురూ చూస్తే బాగుండదు. ఎలాగూ ఆవు ఈననే ఈనింది కదా ? ఇంట్లోకి తీసుకురా ... ?" విశ్వనాథం అన్నాడు.

భర్త, పిల్లలవైపు ఒక్కసారి ఆశ్చర్యంగా చూసి లలితమ్మ దూడను పట్టుకుని ముందుకు నడిచింది. దూడను అనుసరించి ఆవు కూడా ఆమె వెంట ఇంటి ఆవరణలోకి వచ్చింది.

"ఏమండీ ఆ ఆవు ఎవరిదో ఏమో! ఇంకా దాని కోసం ఎవరూ రాలేదు. ఆవు మనింట్లో ఉన్నట్లు వీధిలో నలుగురికీ చెప్పండీ. ఆ సెంటర్లో కొట్లవాళ్ళ క్కూడా చెప్పండి. పాపం! ఆ ఆవు యజమానులు ఆవు కోసం ఎక్కడ వెతుక్కుంటున్నారో ఏమో?"

భోజనం చేస్తున్న విశ్వనాథంతో పాటు పిల్లలక్కూడా గుండె ఆగినంత పని అయింది.

దూడని ఇంటికి తీసుకురాగానే కడిగి శుభ్రం చేసింది లలితమ్మ. నాలుగు ధారలు తీసేసి ఆవు పొదుగును దూడకి కరిపించింది. ఆ తరువాత శుభ్రం చేసింది. ధాన్యం తెప్పించి దంచి ఆవుకు ఆహారంగా పెట్టింది.

"ఒరేయ్ ! ఈనిన ఆవుకు ఆకలి ఎక్కువగా ఉంటుంది. ఏదిపడితే అది తినాలనిప్రయత్నిస్తుంది. అలా తింటే కష్టం. కొన్నాళ్ళ పాటు జొన్నలు, గంట్లు పెడితే మంచిది.

అందుచేత ఆవును కాస్త కనిపెట్టి ఉండండి." అందరికీ బోధచేసింది.

కొంతసేపయ్యాక జున్ను పాలు తీసింది.

ఇప్పుడు లేగదూడ తనంత తాను నడుస్తోంది. తల్లి దగ్గర పాలు తాగుతోంది. ఆవు సమస్య కూడా ఏమీ లేదు.

"నయం. ఊరంతా దండోరా వేయించమన్నావు కాదు ! అన్నిటికి అంత తొందరవుతే ఎలా? కావాల్సిన వాళ్ళు వాళ్ళే వెతుక్కుంటూ వస్తారు. అంతవరకూ నువ్వు పొద్దుటినుంచి పడ్డ కష్టానికి, నీ పిల్లల్ని, ఆవు పాలన్నా తాగనియ్. నీ పెద్ద కూతురు, అల్లుడు కూడా వస్తున్నారు. ఆ విషయం మరిచిపోకు."

అవును మమ్మీ. లేగదూడ ముద్దొస్తున్నది. నాలుగు రోజులు దాన్ని మనింట్లో ఉండనియ్ మమ్మీ. ప్లీజ్.."

పిల్లలంతా తలా ఒక విధంగా అభ్యర్థించారు.

తల్లి ప్రేమ లలితమ్మను బలహీనురాలిని చేసింది. అసలే పాలు దొరకని కాలం. పైగా పెద్ద కూతురు, అల్లుడూ వస్తున్నారాయె! హాయిగా పిల్లలంతా నాలుగు రోజులు పాటు ఆవు పాలు తాగితే తప్పేమిటి? మళ్ళీ మళ్ళీ అలాంటి అవకాశం తమకు వస్తుందా?

ఆమె అనుకున్నట్టే జరిగింది. రాగానే అల్లుడూ, కూతురికి జున్ను పెడితే సంతోషంగా తిన్నారు.

"ఇలాంటి జున్ను ఎంత డబ్బు పోసి కొందామన్నా మాకు ఢిల్లీలో దొరకదు అత్తయ్యగారూ!" అంటూ అల్లుడు స్వయంగా ఆమెని పొగిడాడు కూడా.

ఏ విషయంలోనూ ఏకాభిప్రాయం కుదరని ఆ ఇంట్లో జున్ను ముక్కల రుచి విషయంలో, అప్పుడే ఈనిన ఆవు ఇంట్లో ఉండటం వల్ల గల లాభం విషయంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది.

"అమ్మా ! మేము ఈ ఊళ్ళో ఉన్నన్ని రోజులు ఆవుని మనింట్లోనే ఉంచు. నీ అల్లుడు కూడా నీతో ఈ విషయం చెప్పమన్నాడు."

"అలాగేలేమ్మా. ఆ ఆవు యజమానులు వచ్చి అడిగిందాకా మనింట్లోనే ఉంచుకుందాం."

మూడు రోజులు ఆ ఇంట్లో పాల పండగ, జరుపుకొన్నారు. పెరుగు సమారాధన చేసుకొన్నారు.

నాలుగో రోజు ఉదయం ... చాలా పొద్దుపోయి నిద్రపోవటం వల్ల, పని అలసట వల్ల లలితమ్మ కాస్త ఆలస్యంగా నిద్ర లేచింది.

అప్పటి కింకా ఎవరూ పక్కల మీద నుంచి లేవలేదు. అయినా శ్యామ్ గదిలో నుంచి పాశ్చాత్య సంగీతం బిగ్గరగా వినిపిస్తోంది. ఆ పాటలతో పోటీ పడుతున్నట్లు హిందీ పాటలు అల్లుడిగారి గదిలో నుంచి ఇంకా బిగ్గరగా వినిపిస్తున్నాయి. ఆ ధ్వనులతో, ఈ ధ్వనులతో ఇల్లంతా గందరగోళంగా ఉంది.

ప్రతి రోజు ఆ సమయానికి పాలు పితికేసేది లలితమ్మ.

"అయ్యో, ఇవాళ ఆలస్యమయిందే" అనుకొంటూ ఆమె ఆవు దగ్గరికెళ్ళి పొదుగు పట్టుకోబోయింది,

ఆవు, పొదుగు ఆమె చేతికి అందకుండా పక్కకు తిరిగింది. పొదుగును పట్టుకోవడానికి ఆమె ఎన్నో ప్రయత్నాలు చేసింది. చివరకు పట్టుకొని పిండితే పాలే రాలేదు. నిన్నటిదాకా అన్ని పాలిచ్చిన ఆవుకు ఇవాళేమయింది. ఎందుకింత తక్కువ పాలనిచ్చింది?

మర్నాడు కూడా అలాగే జరిగింది.

"అత్తయ్యగారూ, ఇవాళ నేను ప్రయత్నిస్తానుండండి " అంటూ అల్లుడు ఒక చేత్తో టూత్‌బ్రష్‌తో, మరో చేత్తో టూ ఇన్‌వన్‌తో వచ్చాడు. టూ-ఇన్ వన్‌లో అప్పుడేదో పిచ్చి సంగీతం వస్తోంది. ఆవుకు అల్లంత దూరంలో టూ-ఇన్ వన్‌ను పెట్టి దగ్గరి కెళ్ళాడు అల్లుడు. పొదుగు పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న అతన్ని ఆవు ఫెడేలుమని కాలితో తన్నింది. పెద్దగా రంకెలు వేస్తూ, నానా భీభత్సం చేయసాగింది.

"ఆవు సాధుజంతువు. ఇలా వీరరూపం దాల్చిందంటే ఏదో కారణం ఉండి ఉండాలి". లలితమ్మ అంది.

"కారణమా, గాడిదగుడ్డా? బజారున పోయే ఆవును జాలితల్చి సేవచేసి, మేపబెడితే ఇలాగే అవుతుంది. దాని కేదో పిచ్చిరోగం ఉండి ఉంటుంది. అందుకే దాణా దండగని ఆవుని యజమాని వదిలేసి ఉంటాడు. మన కెందుకీ తద్దినం? ఎలా వచ్చిందో అలాగే దాన్ని పంపేయండి." విశ్వనాథం కోపంగా అరిచాడు.

"అందుకు నేను చచ్చినా అంగీకరించను. అసలు యజమాని ఎవ్వరో అతనికే ఆవును ఇస్తాను. అంతే!"

లలితమ్మ కంఠంలో కఠినత్వాన్ని చూసి అంతా నివ్వెరపోయారు.

✡ ✡ ✡

"ఓర్నాయనో, నాలుగు రోజులుగా నా ఆవు కనిపించక ఊళ్ళన్నీ వెతుకుతున్నానురా దేవుడా! ఇప్పటికైనా ఈ ఇంట్లో ఉందని తెలియబట్టి కానీ, లేకపోతే నేను నట్టేట్లో మునిగిపోయేదాన్ని కదరా దేముడా!" మధ్యాహ్నానికల్లా శోకండాలు పెడుతూ ఒకామె వచ్చింది.

తీరా చూస్తే ఆమె చెప్పిన గుర్తులన్నీ తప్పే! అలా సాయంకాలందాకా ఆవు తమదంటూ జనం వరుసగా వస్తూనే ఉన్నారు.

మొదటి అయిదారుగురు ఆవు ఆనవాళ్ళే సరిగ్గా చెప్పలేకపోయారు. కానీ ఆ తరువాత ఎలా తెలుసుకున్నారో ఏమో, అంతా ఆనవాళ్ళు సరిగ్గాచెప్పసాగారు.

లలితమ్మకు ఏం చేయాలో తోచలేదు. అందరూ ఆనవాళ్ళు సరిగ్గా చెప్తే, ఎవరిదని నిర్ణయించటం? ఎవరి కివ్వటం?

ఆమె దొడ్లోకి వెళ్ళి ఆవును పరిశీలనగా చూచి వచ్చింది.

" ఆ ఆవుకు ప్రత్యేకంగా ఒక ఆనవాలు ఉంది. అది చెప్పినవాళ్ళకే ఆవు నిస్తాను"

అంటూ ఒక్కొక్కరినీ పిలిచింది.

ఆ ఆనవాలు చాలామంది చెప్పలేకపోయారు.

"నా ఆవు చెవి ఒకటి కాస్త కత్తిరించినట్లు వంకర తిరిగి ఉంటుంది." ఆ వీధి చివర్లో పాలమ్ముకొనే సుబ్బమ్మ చెప్పింది.

సుబ్బమ్మకు ఆవును ఇచ్చేద్దామనుకుంటుండగా మరో వ్యక్తి వచ్చి ఆ ఆనవాలును చెప్పడంతో కథ మళ్ళీ మొదటికొచ్చింది.

"లలితమ్మగోరూ, ఆ ఆవు సుబ్బమ్మగోరిదికాదు. సూరయ్యగారిదీ కాదు. సుబ్బారాయుడుఅని నాకు తెలిసిన ఒకాయనది. సుబ్బమ్మ సూరయ్య ఇద్దరూ మీ పిల్లలకు లంచం ఇచ్చి ఆ ఆనవాలు తెలుసుకున్నారు, మీరు ఎవరికిచ్చినా గొడవైపోతుంది. జాగ్రత్త !

ఆ వీధి మొదట్లో బడ్డీకొట్టు భాస్కరం హెచ్చరించాడు. భాస్కరానికి రౌడీలంతా స్నేహితులే.

ఇంతలో సుబ్బమ్మ, సూరయ్యలు ఆవు నాదంటే నాదేనని పోట్లాడుకొని అల్లరి చేయసాగారు. దాంతో అందరూ ఆవు తమదేనంటూ అరవసాగారు.

రాత్రయింది. ఆవును తీసుకుని తప్ప ఇళ్ళకుపోమని భీషణ ప్రతిజ్ఞలు చేసి అంతా గోలగోలగా ఆ ఇంటి ముందే బైఠాయించారు. ఈ వింత చూడడానికి చుట్టుప్రక్కల వాళ్ళంతా పోగయ్యారు.

లలితమ్మకు ఏం చేయాలో తోచలేదు. బేజారెత్తిపోయింది. ఆమె పాలిట దేముడిలా విశ్వనాధం అప్పుడు రిక్షా దిగాడు.

"ఏమండీ!" అంటూ బేలగా అతన్ని చుట్టుకొనిపోయి ఏడవసాగింది.

"బజారునపోయే తద్దినాన్ని నెత్తికి తెచ్చుకోవటం అంటే ఇదే !నేను చెప్తే విన్నావా?' అంటూ భార్యను సముదాయించాడు మందలిస్తూ. ఆ తరువాత అతని క్వార్రీల బుర్ర ఒక్క క్షణం ఆలోచించింది.

ఆవు తమదనుకొన్న వాళ్ళంతా రేపు ఉదయం ఆరుగంటలకల్లా ఇక్కడికి రండి. ఆ ఆవు ఎవరిదో తేల్చి సరైన యజమానికి అప్పచెప్తాం" అంటూ అందరినీ పంపించేశాడు.

✡ ✡ ✡

నాలుగు గంటలకే జనం ఆ ఇంటి ముందుకు రాసాగారు.

రాత్రికి రాత్రి ఆ విషయానికి ఎక్కడలేని ప్రచారం రావటం వల్ల కొందరు ఆవు కోసం, మరి కొంతమంది ఏం జరుగుతుందో చూద్దాం అన్న ఉత్కంఠతో అక్కడికి చేరుకోసాగారు. ఆరు గంటలకి వీధంతా జనంతో నిండిపోయింది.

జనంలో కొందరు పెద్దల సలహాపైన విశ్వనాధం అప్పటికప్పుడు మైక్‌ను పురమాయించక తప్పలేదు. మైక్‌లో పిచ్చిసినిమా పాటలతో కాసేపు ఆ వీధి వీధి హోరెత్తిపోయింది.

సరిగ్గా ఆరు గంటలకు ఆవును వీధిలోకి తీసుకొచ్చారు.

"ప్రజలారా! అయిదు రోజుల క్రితం ఈ ఆవు వీధిలో ఈనడానికి సిద్ధంగా ఉంది. మా ఆవిడ చూసి దగ్గరుండి ఆవు ఈనేలా చూసింది. ఆ తరువాత ఆవుకూ, దూడకూ చేయాల్సిన సపర్యలన్నీ చేసింది. ఆవు ఆనవాళ్ళు ఎవరూ చెప్పనక్కర్లేదు. కానీ ఈ ఆవు నుంచి పాలు పిండిన వారేఈ ఆవు యజమానులుగా భావించి, దాన్ని వారికి ఇస్తాము." మైకులో అనౌన్స్ చేశాడు విశ్వనాథం.

అంగీకారసూచకంగా జనం చప్పట్లు కొట్టారు. అరిచారు. తిరిగి మైకులో పాటలు ఆరంభమయ్యాయి. ఎటుచూసినా సౌండ్స్... రకరకాల సౌండ్స్... వెర్రెత్తించే సౌండ్స్ !

జనాన్ని తోసుకొని సుబ్బమ్మ ముందుగా ఆవు వద్దకెళ్ళింది. పొదుగు పట్టుకోబోతే ఉగ్రరూపం దాల్చింది ఆవు. సుబ్బమ్మ మనుషులు ఇద్దరు బరిలోకి దిగి ఆవు కొమ్ముల్ని గట్టిగా పట్టుకొన్నారు. అయితే సుబ్బమ్మను కాళ్ళతో పెడీలుమని తన్నింది ఆవు. జనం నవ్వారు. సుబ్బమ్మ తలవంచుకు వెళ్ళక తప్పలేదు.

ఆ తరువాత సూరయ్య వచ్చాడు. ఎటువంటి పశువులనైనా మచ్చిక చేసుకోగలడన్న పేరుంది అతనికి. ఎన్నో ఏళ్ళుగా పాడి పశువులతో సంబంధం ఉంది.

ఆవు శరీరంలో కొన్ని ప్రాంతాలను నిమిరి, కొన్ని సౌండ్స్ చేసి ఆవును కాస్తంత ప్రసన్నం చేసుకోగలిగేడతను. అతని అనుచరులు ఆవు కాళ్ళు పట్టుకొన్నారు. కొమ్ములు పట్టుకొన్నారు.

భయపడుతూనే సూరయ్య ఆవు పొదుగు పట్టుకొని పిండాడు. ఆశ్చర్యం! ఒక్క చుక్క పాలధార రాలేదు.

అంతా ఎగతాళిగా నవ్వారు.

ఇంకో పదిమంది ఆవు కాలి తాపులను తిన్నాక ఆవు మాదని అనటానికి చాలామందికి భయంవేసి ఊరుకున్నారు.

"ఆవు తాలూకు యజమానులు ఇక్కడెవ్వరూలేరని తెలిసిపోయింది. వారెవరో వచ్చేదాకా ఈ ఆవును మా ఇంట్లో ఉంచుకోవటం సాధ్యపడదు. కనుక ఈ ఆవును, సంబంధిత ప్రభుత్వ శాఖకు అప్పచెప్తాము. యజమానులు వారి నుంచి పొందవచ్చు" విశ్వనాథం మైకులో ప్రకటించాడు.

"ఆ అవసరం లేదు. ఆ ఆవు నాది." ఒక వ్యక్తి జనం మధ్యనుంచి ముందు కొచ్చాడు.

సన్నగా, బక్కగా బీదగా ఉన్న ఆ వ్యక్తిని చూసి అంతా పరిహాసంగా నవ్వారు.

"ఆవు దగ్గరి కెళ్ళి పాలు పిండి మీదని నిరూపించుకోండి."

"అలాగే, కానీ ఆ అవసరం నాకు లేదు. నేను చెప్పినప్పుడు మీలో ఎవరు వెళ్ళి పాలు పితికినా ఆవు పాలనిస్తుంది.

"అంటే..."

"చెప్తాను. కానీ ముందుగా నాదొక అభ్యర్థన. దయచేసి ఆ సినిమా పాటలను, వింత శబ్దాలను ఆపించండి. కొద్ది నిముషాలను ఆ మైకును నా కివ్వండి. ప్రజలంతా కొంచెం

నిశ్శబ్దాన్ని ప్రశాంతతను పాటించమని మనవి."

జనంలో ఉత్సుకత పెరిగింది. అందుచేత అంతా సైలంట్ అయిపోయారు. మైక్‌లో పాటలు, టేప్ రికార్డుల్లో శబ్దాలు ఆగిపోయాయి.

ఆ బక్కచిక్కిన బీదవ్యక్తి మైకు ముందుకొచ్చి ఒక్క క్షణం కళ్ళు మూసుకొని నిశ్శబ్ధంగా నిలబడ్డాడు.

"శన్నో మిత్రస్యం వరుణః..." అంటూ అందుకొని వేద మంత్రాలని స్వరయుక్తంగా ఉచ్ఛస్వరంతో కొంతసేపు పఠించాడు.

జనం మంత్రముగ్ధులయిపోయారు. అక్కడి వాతావరణం ఒక్కసారి ప్రశాంతంగా మారిపోయింది. అప్పుడా వ్యక్తి మధురకంఠంతో ఒక త్యాగరాజ కీర్తనను పాడాడు.

" ఇప్పుడు మీలో పాలు పితకడం చేతనయిన ఎవరైనా సరే ఆవు దగ్గరికెళ్ళి పాలు పిండండి. పాలనిస్తుంది."

అతని మాటలకు అంతా ఆశ్చర్యపోయారు. కానీ ఎవరికీ నమ్మబుద్ధేయలేదు. సాహసించి ఆవు దగ్గరికి ఎవరూ వెళ్ళలేదు.

"నాయనలారా! ఆవు సాధుజంతువు. దాన్ని చూసి భయపడనక్కరలేదు. అలా మనిషి భయపడేలా ఆవు మారిందంటే అది ఆవు తప్పు కాదు. అలా మారే వాతావరణాన్ని సృష్టించిన మనుషులది. భయంలేదు. నేనున్నానుగా - ఎవరో ఒకరు వెళ్ళి పాలు పితకండి."

అయినా ఎవరూ ధైర్యం చేసి ముందుకు రాలేదు.

లలితమ్మ ఇక ఆగలేకపోయింది. పిండడానికి పాత్రతో ముందుకొచ్చింది.

"చాలా సంతోషం తల్లీ. నా ఆవుకు సేవచేసిన దయామూర్తివి. ఆవులాంటి అమ్మవి. నువ్వు పొదుగు పట్టుకొంటే ఆవు మరిన్ని పాలనిస్తుందమ్మా. మరో పాత్ర తెప్పించు."

లలితమ్మ ఆవు దగ్గరకు వెళ్తుంటే ఆయన మరో కీర్తనను అందుకొన్నాడు. లలితమ్మ పొదుగు దగ్గరి కెళ్తుంటే ఆవు ఆమెను ఆహ్వానిస్తున్నట్లు తల ఆడించింది. పొదుగు పట్టుకోవడమే ఆలస్యం - పాలు ధారాపాతంగా వచ్చాయి. రెండు పాత్రలు నిండిపోయాయి.

" ఈ మాయ ఏమిటో చెప్పాలి" ఎవరో 'తాన' అంటే అంతా 'తందాన' అన్నారు.

"ఇందులో మాయలూ, మార్మాలు ఏమీ లేవు నాయనా. ప్రశాంత వాతావరణానికి మంత్రనాదాలకీ, శాస్త్రీయ సంగీత స్వరాలకూ ఈ ఆవు అలవాటుపడింది. అలవాటు లేని ఇక్కడి వాతావరణ కాలుష్యం, శబ్ద కాలుష్యాలకు తట్టుకోలేకపోయింది. అంతటి సాధుజంతువూ అందుకే జడత్వాన్ని పొందింది. భీకరత్వాన్ని పొందింది. తిరిగి దానికి అలవాటైన వాతావరణాన్ని సమకూర్చడమే నేను చేసిన మాయ. మనం పెరిగిన ప్రకృతి, మన ప్రకృతిని, అంటే తత్వాన్ని నిర్ణయిస్తుంది. ఆ ప్రకృతిలో కాలుష్యం ఏర్పడి మారిపోతే మన ప్రకృతిలోనూ మార్పు వస్తుంది. ఎన్విరాన్‌మెంటల్ ఫేక్టర్ అని దీన్నే ఇంగ్లీషులో అంటారు. ప్రకృతి కలుషితమైతే మనిషి... నోనో ... మానవ స్వభావమే కలుషితమవుతుంది.ప్రకృతిని కాదని ఏ జీవీ జీవించలేదు. ప్రకృతి సౌందర్యాన్ని రక్షించుకోటానికి మానవుడు పెంచుకుంటున్న వైజ్ఞానిక శక్తి ఉపయోగపడాలి

కాని, శక్తివంతమైన ప్రకృతిని ధ్వంసం చేయడానికి కాదు."

"ఇంతకీ మీరెవరు" విశ్వనాథం లడిగాడు.

"నా పేరు శివయ్య. చిన్నప్పట్నుంచి నాకు ఆవులంటే ప్రాణం. నేనంటే ఆవులకి ప్రాణం. ఆవుల్ని పెంచడం నా హాబీ. నా వృత్తి. నా జీవితం. అందుకే నన్నంతా ఆవుల శివయ్య అంటారు.ఇక్కడికి దగ్గరలో వున్న పల్లెటూరు నాది."

"మరి ఈ ఆవు ఎలా తప్పిపోయింది"?

"ఆవు తప్పిపోలేదు నాయనా. మనిషినైన నేనే నా కర్తవ్యాన్ని క్షణకాలం విస్మరించడం వల్ల ఆవు నుంచి తప్పిపోయాను. అదంతా ఇప్పుడు అనవసరమైన కథలే నాయనా" శివయ్య నవ్వుతూ అన్నాడు. అంటూ చిత్రంగా ధ్వని చేశాడు. ఆవు అతని దగ్గరి కొచ్చింది.

"ఈయనెవరో ఎర్రిబేమ్మడిలాగున్నాడ్రా!" జనంలో ఎవరో అంటే కొందరు కిసుక్కున నవ్వారు.

"అంతే నాయనా, ఆమాట మారిపోతున్న మానవ ప్రకృతికి నిదర్శనం. బుద్ధి కాలుష్యానికి తార్కాణం. దిగజారిపోతున్న విలువలకు దర్పణం. మీరు ఎగతాళిగా అన్నా అది నాకు పొగడ్తే. కానీ నాయనలారా. నేను నిజానికి జన్మరీత్యా బ్రాహ్మణుడిని కాను. కులం ఏమిటో చెప్తే మీ రసలు నమ్మలేరు. ఎదగండి నాయనలారా, ప్రకృతి నర్థం చేసుకోండి. కులాల కాలుష్యంతో దిగజారిపోకండి ".

ఆవు, దూడ వెంట రాగా పరమసాత్వికమూర్తిలా గంభీరంగా నడిచి వెళ్తున్న అతన్ని చూస్తూ అంతా గౌరవభావంతో నిలబడిపోయారు !

ఆంధ్రప్రభ వారపత్రిక 23-8-89